

కొరవడిన పర్యవేక్షణ

అటవీ చెక్‌పోస్టుల వద్ద పర్యవేక్షణ కొరవడింది. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. 8లో▸



మహనీయుల చరిత్ర ఆదర్శం

మహనీయుల చరిత్ర భావితరాలకు ఆదర్శమని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్‌తోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి నిర్వహించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
35.0 /25.0

వాతావరణం

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. గాలులు వేగంగా వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పదోన్నతితో గౌరవం, బాధ్యత



అభినందిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాలక్రైం: పోలీసు ఉద్యోగికి పదోన్నతి గౌరవాన్ని, బాధ్యతను పెంచుతుందని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. రామగుండం పోలీసు కమిషనరేట్‌లో పని చేస్తున్న 51మంది కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించిన సందర్భంగా చిహ్నాలను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎలాంటి రిమార్క్ లేకుండా విధులు నిర్వర్తించాలని అన్నారు. విధుల్లో ప్రతిభ కనబర్చిన వారికి అవార్డులు, రివార్డులు అందిస్తామని తెలిపారు. ప్రజలతో సత్సంబంధాలు ఏర్పర్చుకుని నేర నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రఘువేంద్రరావు, ఏఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ గడువు పొడిగింపు

మంచిర్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపు గడువు పొడిగించింది. 25శాతం రాయితీతో గత నెల 31వరకు అవకాశం కల్పించగా చాలామంది చెల్లించలేకపోయారు. దీంతో ప్రభుత్వం ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం 2020లో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 30వరకు గడువు పొడిగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అవకాశాన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారి సంపత్ తెలిపారు.

అన్ని దానాలకన్నా రక్తదానం గొప్పది..



పండ్లు అందజేస్తున్న వెంకటేశ్వర్‌గౌడ్

జైపూర్: అన్ని దానాలకన్నా రక్తదానం చాలా గొప్పదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. బీజేవైఎం, ఎమ్మార్పీఎస్ యువత, ఛత్రపతిశివాజీ యువసేన యువకులు రక్తదానం చేశారు. మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వాహకులు కాసర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రక్తాన్ని సేకరించారు. రక్తదానం చేసిన యువతకు బీజేపీ నాయకులు పండ్లు అందజేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, పార్టీ మండల అధ్యక్షుడు దూట రాజ్‌కుమార్, కోట పల్లి మండల ఇంచార్జి కాసెట్టి నాగేశ్వర్‌రావు, నాయకులు రాంటెంకి సాయి, సుమన్, యువకులు పాల్గొన్నారు.

అత్యవసరం.. వైద్యుల్లేరు..!



ఆసుపత్రిలోని క్యాజువాలిటీ విభాగం



అత్యవసర విభాగం వద్ద వేచి ఉన్న రోగులు

- ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 11 మందికి ముగ్గురే..
- వివిధ కారణాలతో సెలవులో ఇద్దరు, డిప్యూటేషన్‌లో ఒక్కరు
- ఎస్ఆర్‌లు, ఇతర వైద్య నిపుణులకు అదనపు బాధ్యతలు
- తాము చేయలేమంటూ ఇతర వైద్య నిపుణుల నిరసన

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రం మంచిర్యాలలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి అత్యవసర విభాగంలో క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్(సీఎంవో) వైద్యులు కరువయ్యారు. జిల్లాతోపాటు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా, పక్కనే ఉన్న మహారాష్ట్ర నుంచి నిత్యం వందలాది మంది రోగులు ఆస్పత్రికి వస్తుంటారు. అత్యవసర విభాగానికి వచ్చే వారిలో రోడ్డు ప్రమాద క్షతగాత్రులు, ఆత్మహత్యాయత్నం చేసిన వారు, గొడవల్లో గాయపడిన వారు ఉంటారు. ఇలాంటి కేసులు ప్రతీ రోజు 10నుంచి 15వరకు వస్తుంటాయి. నెలలో 300కు పైగా ఇలాంటి కేసులే వస్తుండడంతో ఆయా రోగులకు అత్యవసర వైద్యం అందించి, అనంతరం అవసరమైన ప్రత్యేక వైద్య నిపుణుల వద్దకు రెఫర్ చేయాల్సిన బాధ్యత సీఎంవోలపై ఉంటుంది. కానీ అత్యవసర సమయంలో వైద్యంచేవారు లేకపోవడంతో ఇబ్బందిగా మారుతోంది.

పేరుకే ముగ్గురు సీఎంవోలు

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 11 మంది క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లు ఉండాలి. కానీ ముగ్గురు మాత్రమే ఉండగా, వారిలో ఒకరు మెటర్నిటీ లీవ్‌లో, మరొకరు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా వెళ్లిపోవడంతో ఒక్కరే మిగిలారు. ప్రతీరోజు 10 నుంచి 15 అత్యవసర కేసులు వస్తుండడం, 24 గంటలు అందుబాటులో ఉండాల్సిన చోట మూడు షిఫ్టులకు ఒక్కరే పనిచేయడం కష్టంగా మారుతోంది. దీంతో ప్రభుత్వ మెడికల్ కాలేజీకి వచ్చిన సీనియర్ రెసిడెంట్ల(ఎస్ఆర్)కు సీఎంవో విధులు అప్పగించారు. రెగ్యులర్‌గా ఉండే ఒక్క ఉద్యోగి అనారోగ్య కారణంతో సెలవుపై వెళ్లడం, ఎస్ఆర్‌లు మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేసేందుకు ఉన్న గడువు గత నెల 31వ తేదీతో ముగిసిపోయింది. ఒక్కరు కూడా అందుబాటులో లేరు. దీంతో మెడికల్ కాలేజీకి అనుబంధంగా కొనసాగుతున్న ఆసుపత్రి ఇతర విభాగాల్లో పనిచేస్తున్న వైద్య నిపుణులు, మెడికల్ కాలేజీ ఫ్యాకల్టీలకు సీఎంవోగా అదనపు బాధ్యతలు అప్పగించాల్సి వస్తోంది. దీనిపై వారంతా కలిసి ఈ నెల 1న తమకు సీఎంవో బాధ్యతలు అప్పగించవద్దంటూ నిరసన వ్యక్తం చేశారు.

నియామకానికి ప్రయత్నిస్తున్నాం



మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లు 11 మంది ఉండాలి. అందులో ఒకరు బ్లడ్ బ్యాంకుకు పనిచేస్తే, మిగతా 10 మంది అత్యవసర విభాగంలోనే పనిచేయాల్సి ఉంటుంది. ముగ్గురు ఉద్యోగులు ఉన్నా పలు కారణాలతో సెలవులో, ఇతర విభాగాల్లో వెళ్లి పనిచేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఎస్ఆర్‌లకు, ఇతర వైద్య నిపుణులకు సీఎంవోగా విధులు అప్పగించాల్సి వస్తోంది. ఇప్పటికే పలుమార్లు నోటిఫికేషన్ వేసినా ఎవరూ ముందుకు రావడం లేదు. ఖాళీలు భర్తీ చేసి సీఎంవోల కొరతను తీర్చి రోగులకు చికిత్స అందించేలా చూస్తాం.

– డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డి, మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్

నోటిఫికేషన్ ఇస్తున్నా రావట్లే..

ఆసుపత్రిలో క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లుగా ఖాళీగా ఉన్న పోస్టులను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. వైద్య విధాన పరిషత్ ద్వారా వైద్యులను అప్పగించాలని కోరుతున్నా ఆ శాఖ నుంచి సరైన స్పందన లేదు. దీంతో వైద్య, ఆరోగ్య శాఖను సంప్రదించగా ఇద్దరు వైద్యులను కేటాయించారు. ఆ ఇద్దరు కూడా విధుల్లో చేరేందుకు పలు కారణాలు చూపిస్తూ చేరడం లేదు. దీంతో వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా ఇప్పటికే రెండుసార్లు నోటిఫికేషన్ ఇవ్వగా ఒక్కరు కూడా చేరేందుకు రాలేదు. వచ్చిన వారు తప్పనిసరిగా ఏడాదిపాటు పనిచేయాలని, ముందుగా వెళ్లిపోతే మూడు నెలల వేతనాన్ని అప్పగించాలనే నిబంధనలతో ఒకరిద్దరు చేరేందుకు ఆసక్తి చూపించినా వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ తరఫున గత నెలలో నోటిఫికేషన్ ఇచ్చినా ఒక్కరు కూడా రాలేదు. క్యాజువాలిటీ విభాగాన్ని నిర్వహించడం ఆసుపత్రి నిర్వాహకులకు భారంగా మారుతోంది. అత్యవసర విభాగంలో మెడికో లీగల్ కేసులు(ఎంఎల్‌సీ)లను సీఎంవో వైద్యులే ఇవ్వాల్సి ఉండడం, రోజులో 10కి పైగా ఇలాంటి కేసులే వస్తుండడం, వాటికి సంబంధించిన కోర్టు కేసులకు ఆయా వైద్యులు హాజరు కావాల్సి రావడం వల్లనే సీఎంవోగా పనిచేసేందుకు వైద్యులు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. మూడు షిఫ్టుల్లో 11 మంది వైద్యులు ఉంటేనే ఆసుపత్రి నిర్వహణతోపాటు ఎంఎల్‌సీని ఇచ్చినా ఇబ్బందిగా ఉండదు. పూర్తి స్థాయిలో ప్రభుత్వమే ఖాళీలను భర్తీ చేస్తే రోగులకు అత్యవసర సమయాల్లో వైద్యం అందేందుకు అవకాశం ఉంటుంది.

ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



భీమారంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

భీమారం: లేఅవుట్ లేని భూముల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం కల్పించిన ఎల్‌ఆర్‌ఎస్-2020లో భాగంగా అర్హుల నుంచి రుసుం వసూళ్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం ఆయన మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ పనితీరును పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ సకాలంలో రుసుం చెల్లించి భూములను క్రమబద్ధీకరించుకోవాలని తెలిపారు. ఇందుకోసం మున్సిపాలిటీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. వేసవి ఎండల దృష్ట్యా గ్రామాల్లో మంచినీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువత ఆర్థికాభివృద్ధికి చేయూత అందిస్తోందని, అర్హులు ఈ నెల 14లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని నర్సరీని సందర్శించారు. ఎంపీడీవో మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో బాధ్యతగా వ్యవహరించాలి

మంచిర్యాలటౌన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, వైద్య సిబ్బంది విధుల్లో బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులు, ల్యాబ్, మందుల నిల్వలు, రిజిష్టర్లు, పరిసరాలను పరిశీలించిన అనంతరం సిబ్బందితో మాట్లాడారు. రోగులతో మర్యాదగా వ్యవహరించి మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. వేసవికాలంలో వడదెబ్బ బారిన పడకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

నేడు జయంత్యుత్సవాల నిర్వహణపై సమావేశం

మంచిర్యాలటౌన్: ఈ నెల 5, 14వ తేదీల్లో మహనీయుల జయంతి ఉత్సవాల నిర్వహణపై ఈ నెల 3న ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి పోటు రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతి, 14న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ 134వ జయంతి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆయా కార్యక్రమాల నిర్వహణ కోసం జిల్లాలోని వివిధ సంఘాల ప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రాత్రి పది తర్వాత రోడ్లపై కనిపిస్తే తాట తీస్తాం

- మంచిర్యాల డీసీపీ భాస్కర్ హెచ్చరిక
- ఎన్‌టీఆర్ నగర్‌లో నిర్బంధ తనిఖీలు
- ఇబ్బందులుంటే డయల్ 100కు సమాచారం ఇవ్వండి



మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో రాత్రి పది గంటలు దాటిన తర్వాత రోడ్లపై కనిపిస్తే తాట తీస్తామని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ హెచ్చరించారు. స్థానిక ఎన్టీఆర్ నగర్‌లో బుధవారం సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 8గంటల వరకు నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తనిఖీ చేశారు. అనుమానితుల ఆధార్‌కార్డు, సెల్‌నంబరు, ఫొటో తీసుకుని వివరాలు సేకరించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని కొందరి వాహనాలను స్టేషన్‌కు తరలించారు. అనంతరం డీసీపీ భాస్కర్ కాలనీ ప్రజలతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే సమాచారం అందించాలని కోరారు. యువతీ, యువకులు తమ బంగారు భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్, గంజాయి, పేకాట, మద్యం అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. విద్యార్థులపై ఒక్కసారి కేసు నమోదైతే ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలకు అర్హత కోల్పోతారని తెలిపారు. మహిళలను వేధించడం, చిన్న చిన్న తగాదాల్లో తల దూర్చి కేసుల పాలైతే నేరస్తునిగా ముద్ర పడుతుందని చెప్పారు. ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే డయల్ 100కు ఫోన్ చేస్తే క్షణాల్లో పోలీసులు మీ ముందుంటారని తెలిపారు. ఏసీపీ ప్రకాశ్, సీఐ ప్రమోద్ రావు, ఎస్సైలు పాల్గొన్నారు.


ముందస్తు పన్ను చెల్లింపులకు రాయితీ

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీల్లో ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించేందుకు ప్రభుత్వం 'ఎర్లీబర్డ్' పథకాన్ని అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 31నాటికి పూర్తి పన్ను చెల్లించిన వారికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26కు సంబంధించిన పన్ను చెల్లింపులో 5శాతం రాయితీ కల్పిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో పన్ను బకాయిల వసూళ్లు అంతంత మాత్రమే కావడం, మున్సిపాలిటీ అభివృద్ధి కుంటుపడడం వంటివి జరగకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 30లోపు పన్ను చెల్లించిన వారికే 5శాతం రాయితీ వర్తించనుంది.

మాలగురిజాలకు కిడ్నీ గండం!




ఈ ఫొటోలోని వ్యక్తి పేరు రత్నం పెద్ద బాపు. 66 ఏళ్ల వయస్సు ఉన్న ఆయన నాలుగున్నరేళ్ల క్రితం కిడ్నీ వ్యాధి బారిన పడ్డాడు. రెండు కిడ్నీలు పరిమాణం తగ్గి చురుగ్గా పని చేయడం మానేశాయి. ఏడాది క్రితం దయాలసిస్ చేయాల్సిన అవసరం ఏర్పడగా శరీరం సహకరించదేమోనని భయపడి వెనుకంజ వేశాడు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ వైద్యుడి వద్దకు వెళ్లి ప్రతీ నెల చికిత్స చేయించుకుంటున్నాడు. మందులు వాడుతూ కాలం వెళ్లదీస్తున్నాడు. నెలకు గరిష్టంగా రూ.5 వేల వరకు ఖర్చు చేస్తున్నాడు.



ఈ ఫొటో కనిపిస్తున్న మహిళ పేరు రత్నం రాజక్క. 64 ఏళ్ల వయస్సు కలిగిన ఈమె గత ఆరు నెలల నుంచి కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధ పడుతోంది. రెండు కిడ్నీల్లో ఒకటి బాగానే ఉన్నా మరొకదాని పనితీరు మందగించింది. ఆమెకు దయాలసిస్ చేయించుకునే పరిస్థితి ఇంకా రానప్పటికీ ప్రతీ నెల మందులు వాడాల్సి వస్తోంది. ఈమె కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ వైద్యుడికి వెళ్లి చికిత్స చేయించుకుంటోంది. నెలకు ప్రయాణ ఖర్చులు కలుపుకొని గరిష్టంగా రూ.4 వేల వరకు ఖర్చవుతోంది.

మృతులు..

కిడ్నీ సమస్యలతో గ్రామంలోని ఒకే ఇంటికి చెందిన కలాలి చిన్నరాజం, అంకుబాయి ఐదేళ్ల క్రితం మృతిచెందారు. వీరితోపాటు మరో కుటుంబానికి చెందిన గోలేటి పోశం, ఆయన కొడుకు గోలేటి శంకర్ కిడ్నీ జబ్బుల బారిన పడి మూడేళ్ల క్రితం చనిపోయారు. మరో ఇంట్లో అక్కాచెల్లెళ్లు గోమాస రాజుబాయి, కొండగొర్ల అనసూర్య ఏడాదిలోపు, వీరి తమ్ముడు దాగం మల్లేష్ కిడ్నీలు పాడైపోయి ఆరేళ్ల క్రితం తనువు చాలించారు.



మాలగురిజాల గ్రామం

గ్రామ స్వరూపం

జనాభా	1,684
స్త్రీలు	846
పురుషులు	838
నివాసాలు	435
చేతిపంపులు	06
వాటర్ ట్యాంకులు	02
పంపు మోటార్లు	03

బెల్లంపల్లి: కిడ్నీ వ్యాధులతో ఆ గ్రామంలో ఇంటింటా మరణమృదంగం మోగుతోంది. యేటా ఒకరిద్దరు చనిపోతుండగా.. మరికొందరు మృత్యువుతో పోరాడుతుండడం కనిపిస్తోంది. తాగునీటి సమస్యే కారణమో.. మరేదో తెలియదు గానీ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. బెల్లంపల్లి పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలోని మాలగురిజాల గ్రామం కిడ్నీ సమస్యలకు నెలవుగా మారింది. గత ఐదేళ్లలో కిడ్నీ సంబంధిత వ్యాధులతో 20మంది వరకు చనిపోగా.. పలువురు అనారోగ్యంతో బాధపడుతున్నారు.

ఒక్కో ఇంట్లో ఇద్దరు

గ్రామంలోని ఒక్కో ఇంట్లో ఇద్దరు కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. ఆడామగ తేడా లేకుండా వ్యాధి బారిన పడుతున్నారు. 35ఏళ్ల నుంచి 70ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తులు కిడ్నీలు పనిచేయకుండా సతమతం అవుతున్నారు. ఒక్కో ఇంట్లో తండ్రి లేదా కొడుకు లేదా తల్లి కిడ్నీ సంబంధిత వ్యాధుల బారిన పడి దయాలసిస్ స్థితికి చేరుకుంటున్నారు. కుటుంబ పెద్దలు జబ్బు బారిన పడి మంచానికి పరిమితం కావడంతో కుటుంబ బాధ్యతలు అనివార్యంగా ఇల్లాలిపై పడుతున్నాయి. పిల్లలు వేరే ప్రాంతాల్లో ఉన్న వృద్ధుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. వ్యవసాయదారులు, కూలీల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఆర్థికంగా చితికిపోతున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి పక్షం రోజులకోసారి కొందరు, నెల రోజులకోసారి మరికొందరు డయాలసిస్ చేయించుకుంటున్నారు. హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో గోలేటి సాలక్క డయాలసిస్ చేయించుకుంటోంది. డయాలసిస్ చేయించుకోవాలని మరో వ్యక్తికి వైద్యులు సూచించినా భయంతో మాత్రలతో నెట్టుకొస్తున్నాడు. బోరునీటిని తాగడం వల్లనే కిడ్నీల్లో రాళ్లు ఏర్పడడం, ఇతర వ్యాధుల బారిన పడుతున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నా తాగడానికి ఇష్టపడడం లేదు. అంతకు కొన్నేళ్ల ముందు రక్షిత మంచినీటి పథకం ద్వారా నీటి సరఫరా చేశారు. కానీ గ్రామస్తులంతా బోరు నీరు తాగడానికి అలవాటు పడడంతో ఒక్కొక్కరుగా కిడ్నీ సంబంధిత సమస్యలు కొని తెచ్చుకుంటున్నట్లు తెలుస్తోంది.

చనిపోతున్నారు..



కిడ్నీ సమస్యలు వచ్చి గ్రామంలో చాలామంది చనిపోతున్నారు. పలువురు కిడ్నీ సమస్యలతో సతమతం అవుతున్నారు. వ్యాధి ముదిరాక కానీ బయట పడడం లేదు. దీంతో అనేక మంది ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ఏటా కొంతమంది చనిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. కిడ్నీల సమస్యలు ఏర్పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– దుగుట తిరుపతి, మాజీ సర్పంచ్

నీటి సమస్యతోనే జబ్బులు



గ్రామంలో చాలా ఏళ్ల నుంచి బోరు నీళ్లనే తాగుతున్నం. రుచికరంగా ఉండడంతో తాగడానికి ఇష్టపడుతున్నం. ఎందుకో, ఏమో తెలియదు కానీ ఆరోగ్యంగా కనిపిస్తూనే ఒక్కసారిగా ఒక్కొక్కరు కిడ్నీలు పాడైపోయి మంచం పడుతున్నారు. నీళ్ల కారణంగానే కిడ్నీ జబ్బులు వస్తున్నాయనే అనుమానాలు కలుగుతున్నాయి.

– రత్నం లింగయ్య, గ్రామస్తుడు

సమగ్ర సర్వే చేయిస్తాం..

కిడ్నీల సమస్యలు ఏర్పడడానికి పలు రకాల కారణాలు దోహదపడతాయి. గ్రామంలో ఎలాంటి నీరు తాగుతున్నారనేది గుర్తించాల్సి ఉంది. కిడ్నీ జబ్బుల బారిన పడుతున్న వ్యక్తుల్లో ఎంతమంది డయాబెటిక్ పెషెంట్స్, మరెంతమందికి మద్యం తాగే అలవాటు ఉందనేది గుర్తించాల్సి ఉంది. నిపుణులైన వైద్యులతో విశ్లేషణ చేయిస్తే కానీ కిడ్నీ సమస్యలు ఎందుకు ఏర్పడుతున్నాయో నిర్ధారించలేం. ముందస్తుగా గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయించి రోగులకు వైద్యసేవలు అందించే విధంగా చూస్తాం. ఓ మారు గ్రామంలో సమగ్ర సర్వే చేయించి కిడ్నీ సమస్యల నిర్ధారణ, నివారణకు చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ హరీష్‌రాజ్, డీఎంఅండ్‌హెచ్‌ఓ, మంచిర్యాల

ముగిసిన 'పది' పరీక్షలు



కోటపల్లి: పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలుకుతున్న ఎస్‌వో

మంచిర్యాలఅర్బన్/నెన్నెల/కోటపల్లి: జిల్లాలో పదో తరగతి పరీక్షలు బుధవారం సాంఘికశాస్త్రం పేపరుతో ముగిసాయి. ఈసారి ఒక్క విద్యార్థి కూడా డిబార్ కాకుండా సాఫీగా పూర్తయ్యాయి. 99.70శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. చివరి రోజు రెగ్యులర్ విద్యార్థులు 9,209మందికి గాను 9,181మంది హాజరు కాగా, 49మంది గైర్హాజరయ్యారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 9,198 మందికి గాను 9,175మంది హాజరు కాగా 23మంది గైర్హాజరయ్యారు. గతంలో ఫెయిలైన వారిలో 11మందికి గాను ఐదుగురు రాలేదు. డీఈవో యాదయ్య ఐదు పరీక్ష కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ 15 పరీక్ష కేంద్రాలు తనిఖీ చేశారు. ఈ ఏడాది ముందస్తుగా పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా విద్యుత్, తాగునీరు సౌకర్యం కల్పించారు.

ఆనందంలో మునిగితేలిన విద్యార్థులు

పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు పరీక్షలు ముగియడంతో ఆనందంలో మునిగి తేలారు. చిరు దరహాసాలతో కేంద్రాల నుంచి బయట వేచి చూస్తున్న కుటుంబ సభ్యుల వద్దకు చేరారు. ఇదే చివరి రోజు కావడం, హైస్కూల్ విద్యకు స్వస్తి పలుకుతున్నామని చింతిస్తూనే మళ్లీ ఎప్పుడు కలుస్తామో అంటూ టాటా చెప్పుకోవడం, ఫోన్ నంబరు తీసుకోవడం కనిపించింది. హాస్టల్ విద్యార్థులు పెట్టె సర్దుకుని ఇంటిముఖం పట్టారు. కోటపల్లిలోని కేజీబీవీలో ఇన్నేళ్లు పాఠశాలతో ఉన్న బంధం ముగియడంతో విద్యార్థులు కొంత భావోద్వేగానికి గురయ్యారు. ఉన్నత విద్య అభ్యసించి పాఠశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఎస్‌వో హరిత, ఉపాధ్యాయులు సూచిస్తూ విద్యార్థులకు వీడ్కోలు పలికారు.

ఉత్తమ పురస్కారాలు

పాతమంచిర్యాల: స్త్రీనిధి రుణాల పంపిణీ, రికవరీ ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా సమాఖ్య కార్యాలయంలో ఉత్తమ పురస్కారాలు పంపిణీ చేశారు. సమాఖ్య అధ్యక్షులకు డీఆర్‌డీవో కిషన్ బహుమతులు అందజేశారు. లక్సెట్టిపేట మండల సమాఖ్యకు ప్రథమ, దండేపల్లి మండల సమాఖ్యకు ద్వితీయ బహుమతి, పట్టణ సమాఖ్యలో చెన్నూరుకు ప్రథమ, మందమర్రికి ద్వితీయ బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వెంకటేష్, డీపీఎం స్వర్ణలత, స్త్రీనిధి రీజినల్ మేనేజర్ వెంకటరమణ పాల్గొన్నారు.

ఉత్తమ సీసీగా శ్రీనివాస్



మెమొంటోలు అందజేస్తున్న డీఆర్‌డీవో కిషన్

నెన్నెల: మండలంలోని క్లస్టర్‌లో సెర్ప్ సీసీ(కమ్యూనిటీ కో ఆర్డినేటర్)గా విధులు నిర్వర్తిస్తున్న నరేందుల శ్రీనివాస్ ఉత్తమ సీసీ అవార్డుకు ఎంపికయ్యారు. డీఆర్‌డీఓ కిషన్ అవార్డు అందజేసి శాలువాలతో సన్మానించారు. కాసిపేటకు చెందిన అశోక్ ద్వితీయ బహుమతి అందుకున్నారు. వీరిని డీపీఎం రమణ, ఏపీఎంలు విజయలక్ష్మీ, ప్రకాష్ గౌడ్, సీసీ సత్యనారాయణగౌడ్ అభినందించారు.

కొరవడిన పర్యవేక్షణ!

- అటవీ చెక్‌పోస్టుల వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు
- తూతూ మంత్రంగా ఉన్నతాధికారుల పరిశీలన
- విధుల్లో ఇష్టారీతిగా వ్యవహరిస్తున్న సిబ్బంది



ఇందన్‌పల్లి చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన సీసీకెమెరా

జన్నారం: జన్నారం అటవీ డివిజన్‌లో స్మగ్లింగ్ నిరోధించేందుకు, అధికారుల పనితీరు పర్యవేక్షించేందుకు చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీకెమెరాలు తూతూ మంత్రంగా మారాయి. సీసీకెమెరాల నిర్వహణ చేపడుతున్నా ఉన్నతాధికారులు సీసీఫుటేజీలను పర్యవేక్షించకపోవడంతో క్షేత్రస్థాయి సిబ్బంది ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. చెక్‌పోస్టు వద్ద డ్యూటీలో ఉన్న సిబ్బంది సంతకం చేసిన తర్వాత అక్కడే 24 గంటలు పని చేయాల్సి ఉంటుంది. కానీ సంతకం చేసిన తర్వాత తమ సొంత పనుల కోసం వెళ్తున్నట్లు సమాచారం ఉంది. చెక్‌పోస్టుల వద్ద బీట్, సెక్షన్ అధికారులతో పాటు వాచర్లు కూడా విధులు నిర్వహిస్తుంటారు. అయితే వాచర్లకు బాధ్యతలు అప్పగించి అక్కడ డ్యూటీ చేసే ఇతర సిబ్బంది సొంత పనుల కోసం వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఇలా పలు చెక్‌పోస్టుల్లో జరుగుతుండగా ఇటీవల ఉన్నతాధికారి గమనించి హెచ్చరించినట్లుగా సమాచారం. గతంలో పని చేసిన ఎఫ్‌డీవో మాధవరావు సీసీకెమెరాల్లోనే సిబ్బంది పనితీరు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ హెచ్చరికలు జారీ చేయడంతో ఎలాంటి నిర్లక్ష్యం జరగలేదు. కానీ ప్రస్తుతం ఉన్నతాధికారులు సీసీకెమెరాలను పట్టించుకోకపోవడంతో సిబ్బందిపై పర్యవేక్షణ లేక ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు.

మూడేళ్ల క్రితం ఏర్పాటు..

జన్నారం అటవీ డివిజన్‌లో స్మగ్లింగ్ నిరోధించేందుకు, అధికారుల పనితీరు పర్యవేక్షించేందుకు మూడేళ్ల క్రితం చెక్‌పోస్టుల వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీకెమెరాల ఏర్పాటుతో చెక్‌పోస్టుల వద్ద జరుగుతున్న వాహనాల తనిఖీలు, రాత్రి పూట వాహనాల ప్రవేశంతో పాటు చెక్‌పోస్టుల వద్ద పని చేస్తున్న సిబ్బంది పనితీరు పర్యవేక్షించేవారు. డివిజన్‌లోని ఇందన్‌పల్లి, కలమడుగు, తపాలపూర్ చెక్‌పోస్టుల వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు చేశారు.

ఎన్నో ప్రయోజనాలు..

ప్రధాన రహదారిపై గల అటవీశాఖ చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీకెమెరాలతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. ప్రధాన రహదారిపై స్మగ్లింగ్‌కు తగ్గిపోవడంత పాటు అనుమానిత వాహనాలను గుర్తించే అవకాశం ఉంది. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలకు పాల్పడిన వారిని గుర్తించడంలో ఈ సీసీ కెమెరాలు సహకరిస్తాయి. ఇప్పటి వరకు పలు కేసుల పరిష్కారంలో పోలీసులు అటవీశాఖ చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీకెమెరాలను పరిశీలించారు.

నిత్యం పర్యవేక్షిస్తున్నాం..



జన్నారం డివిజన్‌లో నిఘా కోసం అటవీ చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. గతంలో కొంత పర్యవేక్షణ కొరవడింది. కానీ నేను విధుల్లో చేరినప్పటి నుంచి సీసీకెమెరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. సిబ్బంది పనితీరు కనిపెడుతున్నాం. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరిపై ఇప్పటికే చర్యలు తీసుకున్నాం.

– కారం శ్రీనివాస్, రేంజ్ అధికారి

క్లుప్తంగా

రైతుపై అడవిపంది దాడి



గాయాలతో కిషన్

జన్నారం: అడవి పంది దాడిలో మండలంలోని పొనకల్ గ్రామానికి చెందిన రైతు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు చిరివేణి కిషన్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం పొనకల్ గ్రామ శివారులోని పంట పొలాలకు కిషన్ నీరు పెట్టేందుకు వెళ్లగా అడవిపంది ఒక్కసారిగా దాడి చేసింది. భయంతో కిషన్ కేకలు వేయగా సమీపంలో ఉన్న మరో వ్యక్తి రావడంతో అడవి పంది పారిపోయింది. దాడిలో కిషన్ కుడి భుజం, కుడి కన్ను కింద గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు జన్నారం ఆసుపత్రిలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు.

పాత గోదాంలో అగ్నిప్రమాదం

భైంసాటౌన్: పట్టణంలోని ఈసేవా కాంప్లెక్స్ సమీపంలో గల పాత గోదాంలో బుధవారం మంటలు చెలరేగాయి. గోదాం కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉండగా చెత్తాచెదారం పేరుకుపోయింది. ప్రమాదవశాత్తు చెత్తకు నిప్పంటుకోగా దట్టమైన పొగలు రావడంతో స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారమిచ్చారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో ఎలాంటి నష్టం వాటిల్లలేదు.

పాఠశాలలో చోరీకి యత్నం



తరగతి గదిని పరిశీలిస్తున్న ఎస్సై

కడెం: మండలంలోని పెద్దూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూమేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలకు గత మూడు రోజులుగా సెలవులు ఉన్నాయి. సెలవు రోజుల్లో గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలలోని రెండు తరగతి గదుల తాళాలు పగలగొట్టి చోరీకి యత్నించారు. పాఠశాలలో విలువైన సామగ్రి లేకపోవడంతో దొంగలు ఎక్కడివి అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. కాగా హెచ్‌ఎం ఫిర్యాదుతో ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి బుధవారం పాఠశాలను పరిశీలించారు.

కీచక ఉపాధ్యాయులపై కేసు నమోదు

నర్సాపూర్ (జి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో గత ఫిబ్రవరిలో విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన గణిత ఉపాధ్యాయుడు ఆలూరి మనోహర్ రెడ్డి, ఆంగ్ల ఉపాధ్యాయుడు సాయిని మోహన్‌రావులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసుతో పాటు బుధవారం అదనంగా ఎస్సీ, ఎస్టీ పీఓఏ యాక్ట్ 1989ను నమోదు చేశారు. విచారణ అధికారిగా ఉన్న నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనా మాట్లాడుతూ ఫిబ్రవరి నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు పరారీలో ఉండగా నిర్మల్ జిల్లా కేంద్రంలో మార్చి 8న మనోహర్‌రెడ్డిని, ఏప్రిల్ 1న మోహన్‌రావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ శివారులో పేకాట స్థావరంపై బుధవారం ఎస్సై గోపతి సురేశ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న వారిలో ముగ్గురు పారిపోగా ఇద్దరిని అరెస్ట్ చేశారు. రూ.3,720 నగదు, రెండు మొబైల్ ఫోన్‌లు, ఆటో స్వాధీనం చేసుకున్నారు. కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంగిపల్లిలో వన్యప్రాణుల వేట

- ఉచ్చుకు బలైన చుక్కల దుప్పులు
- మాంసం విక్రయానికి యత్నం
- పట్టుకున్న అటవీశాఖ అధికారులు



చుక్కల దుప్పి మాంసంతో నిందితులను పట్టుకున్న అటవీశాఖ అధికారులు

జైపూర్: అటవీప్రాంత సమీపంలో పంట పొలాలను కాపాడుకోవడానికి ఏర్పాటు చేసిన విద్యుత్ తీగల ఉచ్చుకు వన్యప్రాణులు బలయ్యాయి. ఉచ్చుకు రెండు చుక్కల దుప్పులు మృత్యువాతపడగా వాటి మాంసాన్ని విక్రయించేందుకు యత్నించిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. జైపూర్ మండలం గంగిపల్లి గ్రామ శివారులో గల పంట పొలాల్లో రైతులు అమర్చిన విద్యుత్ తీగలకు రెండు చుక్కల దుప్పులు మృతిచెందాయి. మాంసాన్ని విక్రయించేందుకు చిన్న ముక్కలుగా కోస్తుండగా గంగిపల్లి గ్రామానికి చెందిన పాలమాకుల శ్రీనివాస్‌రెడ్డి, గూడపాపన్నలను అటవీశాఖ అధికారులు పట్టుకున్నట్లు మంచిర్యాల రేంజ్ అధికారి రత్నాకర్ తెలిపారు. ఇద్దరిపై వన్యప్రాణుల చట్టం కింద కేసులు నమోదు చేశామన్నారు.

లాడ్జిలో దాడికి పాల్పడిన వ్యక్తులు అరెస్ట్



అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రమోద్‌రావు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని శ్రీనివాస్ గార్డెన్ సమీపంలోని ఓ లాడ్జిలో ఈనెల 1న రాత్రి జరిగిన దాడి కేసులో బుధవారం ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు స్థానిక సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శ్రీరాంపూర్ భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన ఉషకోయల తరుణ్ తన బంధువులు శ్రావణ్, పర్వతాలు, శ్రీకాంత్, రేవంత్‌లు లాడ్జిలో రూమ్ తీసుకొని శ్రావణ్ కుటుంబ సమస్యపై మాట్లాడుకుంటున్నారు. ఇదే సమయంలో రేవంత్‌కు తెలిసిన వ్యక్తి అశోక్‌రోడ్‌కు చెందిన మురుమూరు సందీప్ తన స్నేహితులు తిగుళ్ల శివకుమార్, అబ్దుల్ అఫ్రోజ్, నిఖిల్, వివేక్, అచ్యుత్, సాకేత్‌లు రేవంత్‌తో పాటు ఇతరులపై దాడిచేశారు. పాత గొడవల కారణంగా సందీప్ రేవంత్‌పై దాడి చేయగా శ్రీకాంత్, తరుణ్, పర్వతాలుకు తీవ్ర గాయాలయ్యాయి. తరుణ్ ఫిర్యాదు మేరకు సందీప్, శివకుమార్, అబ్దుల్ అఫ్రోజ్, నిఖిల్, వివేక్, అచ్యుత్, సాకేత్‌లపై కేసు నమోదు చేయగా శివకుమార్, సాకేత్, అఫ్రోజ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. నిఖిల్, వివేక్, అచ్యుత్, సందీప్‌లు పరారీలో ఉన్నారన్నారు.

న్యాయం చేయాలని గంగపుత్రుల నిరసన



నిరసన తెలుపుతున్న గంగపుత్ర కులస్తులు

నిర్మల్‌చైన్‌గేట్: లక్ష్మణచాంద మండలం నర్సాపూర్ డబ్ల్యూకు చెందిన గంగపుత్ర కులానికి చెందిన 10 కుటుంబాల వారు తమకు న్యాయం చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కుల సంఘానికి సంబంధించిన లెక్కలు అడిగినందుకు సంఘం అధ్యక్షుడు పడగేల మహిపాల్ తమ కుటుంబాలను కుల బహిష్కరణ చేశారన్నారు. గత పది నెలలుగా కలెక్టర్, ఎస్పీలను కలిసి సమస్య పరిష్కరించాలని కోరినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమస్య పరిష్కారానికి వచ్చిన పోలీసులు కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఇచ్చి కులంలో చేరాలని సలహా ఇచ్చారని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు గైని మురళీమోహన్, హెచ్‌ఆర్పీ సంఘం అధ్యక్షుడు సురకంటి ఎల్లారెడ్డి, బాధిత గంగపుత్రులు పుట్టి భీమన్న, పుట్టి ఎర్రన్న ఉన్నారు.

నిరసనలో పాల్గొన్న ఎంపీ నగేశ్



నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు

ఆదిలాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సమీప ప్రభుత్వ భూముల వేలాన్ని నిలిపివేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ ఎదుట బుధవారం బీజేపీ ఎంపీలు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి



చికిత్స పొందుతున్న కూలీలు

కోటపల్లి: మండలంలోని కొండంపేట గ్రామ సమీపంలో ఉపాధి హామీ పథకం కూలీలపై బుధవారం తేనెటీగలు దాడి చేశాయి. కూలీలు అటవీ ప్రాంతంలో పని ప్రదేశానికి వెళ్తుండగా ఒక్కసారిగా దాడి చేయడంతో పరుగులు తీశారు. తేనెటీగల నుంచి తప్పించుకునేందుకు తలోవైపు పరుగు పెట్టారు. దాడిలో గ్రామానికి చెందిన లింగయ్య, బానయ్య, రాజు, సమ్మక్క, అంకమ్మ, బాపు స్వలంగా, పి.స్వరూప తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి బాధితులతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యుడు సత్యనారాయణకు సూచించారు. దాడిలో కూలీల పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న జీహెచ్‌ఎంసీ మేయర్



మేయర్ దంపతులను సన్మానిస్తున్న అధికారులు

సారంగపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ అమ్మవారిని బుధవారం జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మీ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మేయర్‌కు అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. మొక్కులు చెల్లించుకున్న అనంతరం ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న మహాపోచమ్మ దేవాలయం, పరిసరాలను పరిశీలించారు. ఆమె వెంట నాయకులు గడ్డం అరవింద్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తికి జైలు

సోన్/నిర్మల్‌టౌన్: సోన్ మండలం కడ్తాల్ గ్రామానికి చెందిన వ్యక్తికి ఏడు సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.3000 జరిమానా విధిస్తూ నిర్మల్ జిల్లా అసిస్టెంట్ సెషన్స్ జడ్జి శ్రీనివాస్ బుధవారం తీర్పు వెల్లడించారు. కోర్టు సమన్వయ అధికారి డల్లు సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. కడ్తాల్ గ్రామానికి చెందిన గుర్రం భీమన్న ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. 12, ఏప్రిల్, 2023న మధ్యాహ్నం గ్రామంలోని హోటల్‌లో కూర్చున్నాడు. అదే గ్రామానికి చెందిన కుడుకల పోశెట్టితో హోటల్ వద్ద గొడవ జరిగింది. దీంతో పోశెట్టి పక్కన ఉన్న పగిలిన బీర్‌సీసాతో భీమన్నను పొడిచాడు. వెంటనే అక్కడున్న వారు అడ్డుకోగా విషయం తెలుసుకున్న భార్య గంగామణి చికిత్స నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం సోన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపరిచారు. అడిషనల్ పీపీ రమణారావు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టి, నేరం రుజువు చేశారు. దీంతో జడ్జి పోశెట్టికి 7 సంవత్సరాల జైలుశిక్ష, రూ.3000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

జొన్న పంట దగ్ధం



దగ్ధమైన జొన్న పంటను చూపుతున్న రైతు

ముధోల్: ముధోల్‌కు చెందిన కోరి యోగేశ్‌కు చెందిన జొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... యోగేశ్ 10 ఎకరాల్లో మొక్కజొన్న, జొన్న పంటలు సాగు చేశాడు. చేతికొచ్చిన జొన్న పంటను ఒకే చోటకు చేర్చి కుప్పలుగా పోశాడు. ఇటీవల వర్షం కురవడంతో రక్షణ కోసం కుప్పలపై టార్పాలిన్లు కప్పి ఉంచాడు. బుధవారం ఉదయం చేనుకు వచ్చే సరికి పంట కుప్పలు కాలిపోయి ఉన్నాయి. పంట కుప్పలు దగ్ధం కావడానికి గల కారణం ఏంటో తెలియడం లేదని బాధిత రైతు వాపోతున్నాడు. అప్పులు తెచ్చి పంట సాగు చేశానని అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

తెల్లకల్లు షాపుపై పోలీసుల దాడి

బేల: మండలంలోని జంగుగూడ (సైద్‌పూర్)లో లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న తెల్లకల్లు షాపుపై మంగళవారం రాత్రి జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్, బేల ఎస్సై దివ్యభారతిలు సిబ్బందితో కలిసి దాడి చేశారు. తెల్లకల్లు షాపులోని 400 లీటర్ల తెల్లకల్లును ధ్వంసం చేసి, రూ.3వేల నగదును సీజ్ చేసినట్లు వారు పేర్కొన్నారు. షాపు యజమాని బేలకు చెందిన సత్యనారాయణ్ గౌడ్, షాపు నిర్వాహకుడు తుకారాంతో పాటు అక్రమషాపు నిర్వహణకు రూ.12లక్షలకు అనుమతి ఇచ్చిన వీడీసీ చైర్మన్ ఆత్రం రాముడుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భార్య, అత్తపై దాడి.. వ్యక్తి అరెస్ట్



అరెస్ట్ చూపుతున్న ఎస్సై కిరణ్‌కుమార్

తాండూర్: భార్య, అత్తను చితకబాది గాయపర్చిన కేసులో ఓ వ్యక్తిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్ మండలం అచ్చులాపూర్ గ్రామపంచాయతీ కొమ్ముగూడెం గ్రామానికి చెందిన దాగం మల్లేశ్ గతనెల 16న మద్యం తాగి భార్య లావణ్యతో గొడవ పడ్డాడు. లావణ్యపై దాడి చేయడానికి సిద్ధపడగా అత్త రాజు అడ్డుపడింది. కోపోద్రిక్తుడైన మల్లేశ్ గరిటెతో ఇరువురు తలలపై బలంగా కొట్టి గాయపర్చాడు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపి అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

నేరడిగొండ: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. నిర్మల్ వైపు గంజాయి తరలిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు సిబ్బందితో కలిసి బుధవారం బందం ఎక్స్‌రోడ్ వద్ద తనిఖీలు చేపట్టగా నేరడిగొండ మండలం వాంకిడి గ్రామానికి చెందిన షేక్ మజార్, నిర్మల్ జిల్లాకు చెందిన షేక్ ఇమ్రాన్ అనే ఇద్దరు వ్యక్తుల వద్ద 150 గ్రాముల గంజాయి లభించినట్లు తెలిపారు. వారిని విచారించగా నేరడిగొండ మండలంలోని ధన్నూర్(డి) గ్రామానికి చెందిన కాటరే తారాసింగ్ వద్ద నుంచి గంజాయి తీసుకొస్తున్నట్లు తేలిందన్నారు.

వ్యక్తి రిమాండ్

బజార్‌హత్నూర్: గంజాయితో ఉన్న వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మోర్కండి గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి పోలీస్‌పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో గులాబ్‌తండా గ్రామపంచాయతీ పరిధి ఇంద్రనగర్ గ్రామానికి చెందిన ఆడే రాజ్‌కుమార్ అనుమానాస్పదంగా కన్పించాడు. అతడిని తనిఖీ చేయగా అతని వద్ద 100 గ్రాముల గంజాయి లభించింది. వెంటనే రాజ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై అప్పారావు తెలిపారు. బుధవారం బోథ్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీస్



కౌన్సెలింగ్ ఇస్తున్న కానిస్టేబుల్ మోహన్‌సింగ్

బాసర: గోదావరి నదిలో పిల్లలతో కలిసి దూకేందుకు యత్నించిన వ్యక్తికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించిన ఘటన మండలకేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ జిల్లా బోయగల్లికి చెందిన కోమటి గంగప్రసాద్, భార్య లక్ష్మి నిజామాబాద్‌లోని బట్టల దుకాణంలో పని చేస్తుంటారు. వారికి ఇద్దరు ఆడ పిల్లలు వర్షిణి, రక్షిత ఉన్నారు. కాగా కుటుంబ సమస్యల కారణంగా తన ఇద్దరు పిల్లలను తీసుకుని గంగప్రసాద్ బుధవారం బాసర మండల కేంద్రంలోని గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మోహన్‌సింగ్ గమనించి హుటాహుటిన వారి వద్దకు చేరుకున్నాడు. ఆత్మహత్యకు యత్నిస్తున్న గంగప్రసాద్‌ను అతని ఇద్దరి పిల్లలను దగ్గరికి తీసుకొని ఓదార్చాడు. గంగప్రసాద్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించి వారిని అప్పగించారు. కాగా చాకచక్యంగా వ్యవహరించి ఆత్మహత్య చేసుకోకుండా కాపాడిన కానిస్టేబుల్ మోహన్‌సింగ్‌ను ఎస్సై గణేశ్, ఇతర సిబ్బంది అభినందించారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య



రవితేజ (ఫైల్)

తాండూర్: తన కంటిచూపు నయమవుతుందో లేదోననే బెంగతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని తంగళ్లపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కిష్టంపేట గ్రామపంచాయతీ తంగళ్లపల్లి గ్రామానికి చెందిన గోవిందుల కవిత– సత్యనారాయణల పెద్ద కుమారుడు రవితేజ (23) హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. ఇటీవల కంటికి శస్త్రచికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. తనకు కంటి సమస్య తగ్గిపోతుందో లేదోనని మానసికంగా వేదనకు గురై బుధవారం మధ్యాహ్నం తాను చనిపోతున్నట్లు కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కుటుంబసభ్యులు ఇంటికి వచ్చేసరికి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉండడంతో హుటాహుటిన బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే రవితేజ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. యువకుడి మేనమామ అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మంచిర్యాల వాసి మృతి



విజయ్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగ భర్త విజయ్ (53) బుధవారం హైదరాబాద్ రింగురోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం విజయ్ తన అన్న కూతురు సోనిని అమెరికా పంపించేందుకు ఈనెల1న అన్నయ్య రాములు, వదిన విజయ, మరో స్నేహితుడితో కలిసి తన కారులో వెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున తిరిగి వస్తుండగా రింగ్‌రోడ్డుపై కంటైనర్ లారీ ఢీకొనడంతో విజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అన్నయ్య రాములుకు, డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా రాములు భార్య విజయ తీవ్రంగా గాయపడింది. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లోనే చికిత్స పొందుతోంది. విజయ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

రాజ్యాంగ పరిరక్షణకే పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న ఆత్రం సుగుణ

నార్నూర్: రాజ్యాంగ పరిరక్షణకే జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. బుధవారం మండలంలోని పూసిగూడ గ్రామం నుంచి జిల్లా కోఆర్డినేటర్ ఏఐసీసీ సభ్యుడు నరేశ్ జాదవ్‌తో కలిసి పాదయాత్ర ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ దేశంలో నియంతృత్వ, అప్రజాస్వామిక పాలన కొనసాగిస్తున్న బీజేపీ ప్రభుత్వ విధానాలను ప్రజలకు తెలుపాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ప్రజలతో, కార్యకర్తలతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లోఖండే దేవురావు, మాజీ సర్పంచ్ బానోత్ గజానందు నాయక్, మాజీ ఎంపీటీసీ పరమేశ్వర్, మహిళ నాయకురాలు బానోత్ ప్రణీత, పీఏసీఎస్ డైరెక్టర్ కాంతారావు దుర్గే, యంగ్ అండ్ డైనమిక్ లీడర్ కోర్తెల్ల మహేందర్, కాంగ్రెస్ పార్టీ యూత్ జిల్లా ఉపాధ్యక్షుడు నసీర్ తదితరులు ఉన్నారు.

ప్లాట్ల పంపిణీకి కృషి



మాట్లాడుతున్న ఆర్డీవో, అధికారులు

కాసిపేట: నిర్వాసితులకు పది రోజుల్లో పునరావాస కాలనీలో ప్లాట్ల పంపిణీతో పాటు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ డబ్బులు చెల్లించేలా కృషి చేస్తామని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని ఓపెన్‌కాస్టు నిర్వాసిత దుబ్బగూడెం గ్రామస్తులతో సింగరేణి అధికారులతో కలిసి పునరావాస కాలనీలో సమావేశం నిర్వహించారు. కాలనీలో జరుగుతున్న పనుల్లో జాప్యం ఇతర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులతో సంబంధం లేకుండా ఈనెల 11న ప్లాట్ల కేటాయింపు అనంతరం నిర్వాసితులు నిర్మాణాలు చేసుకోవచ్చన్నారు. ఎస్‌ఓటూ జీఎం విజయప్రసాద్, సివిల్ ఎస్‌ఈ రాము, ఎస్టేట్ అధికారిణి నవనీత, దుబ్బగూడెం గ్రామస్తులు పాల్గొన్నారు.